ఆలయ నూతన కమిటీ ఎన్నిక



శంషాబాద్: కొత్వాల్‌గూడలోని హనుమాన్ ఆలయ నూతన కమిటీని గురువారం రాత్రి ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంధం రవీందర్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా గుర్రంపల్లి మల్లేష్ యాదవ్ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా చేవెళ్ల రాజేష్, ఎస్.నవీన్, కోశాధికారులుగా సిద్ధేశ్వర్‌గౌడ్, మహిపాల్, సభ్యులుగా మాణిక్యంరెడ్డి, వెంకటాపురం అశోక్, గుర్రంపల్లి ప్రవీణ్‌యాదవ్, పూర్ణచంద్ర ముదిరాజ్, నాగరాజు, కార్తీక్‌గౌడ్, సాయియాదవ్ నియమితులయ్యారు. కొత్వాల్‌గూడ మాజీ సర్పంచ్ గుర్రంపల్లి ప్రసన్నలింగం యాదవ్, రాగులపల్లి యాదయ్య,రాజురెడ్డి, సత్తిరెడ్డి, సత్తయ్య, శేఖర్ గుప్తా, రాజు, లక్ష్మయ్య, నరసింహ, అంజయ్య, మహేందర్‌రెడ్డి, సిద్దులు ముదిరాజ్, మహేష్, ఆంజనేయులు, శేఖర్ యాదవ్, వై.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ విరాళాల సేకరణ



ఉద్దెంగడ్డ చౌరస్తాలో విరాళాలను సేకరిస్తున్న సీఐటీయూ నేతలు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటాలు చేసే నిమిత్తం సీఐటీయూ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి వెంకటయ్య అధ్యక్షతన గురువారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఉద్దెంగడ్డ చౌరస్తా వద్ద ప్రజల నుంచి విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా అన్ని రకాల దోపిడీలకు వ్యతిరేకంగా.. వివక్షతలను రూపుమాపేందుకు పోరాటాలను సీఐటీయూ చేస్తోందన్నారు. ఈ నెల 6న ప్రారంభమైన ఉద్యమం 14వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలో జరుగుతుందన్నారు. సీఐటీయూ నేతలు నర్సింహగౌడ్, బాబురావుయాదవ్, గోపాల్, శ్రీశైలం, శాంతమ్మ, రమేష్, సుంకయ్య తదితరులు పాల్గొన్నారు.

19న పాలిసెట్ దరఖాస్తుకు చివరి గడువు

శాలిబండ: పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్టు (పాలిసెట్)-2025 దరఖాస్తు కోసం ఈ నెల 19న చివరి తేదీ అని కులీ కుతుబ్‌షా పాలిటెక్నిక్ కళాశాల కో ఆర్డినేటర్ విక్రమ్ వంశీరెడ్డి తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలు పొందేందుకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 19వ తేదీ వరకు ఎస్సీ, ఎస్టీలకు రూ.250లు, ఇతరులు రూ.500 ఫీజులతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.100 ఆలస్యం రుసుంతో ఈ నెల 21వ తేదీ వరకు, తత్కాల్ ఫీజు రూ.300లతో ఈ నెల 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మే 13న పాలిసెట్ ప్రవేశ పరీక్షలు ఉంటాయన్నారు.

నాయీ బ్రాహ్మణులకు వృత్తి శిక్షణ తరగతులు ప్రారంభించాలి

సుల్తాన్‌బజార్: కాంగ్రెస్ ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులకు వృత్తి శిక్షణ తరగతులు ప్రారంభించాలి అని నాయీ బ్రాహ్మణ మహిళా సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రెటరీ జి.నవనీత అన్నారు. గురువారం కోఠిలోని కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులకు వృత్తి శిక్షణ తరగతులు ప్రారంభించాలని కోరారు. గత ప్రభుత్వంలో నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్‌కు చైర్మన్‌ను నియమించలేదని వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఉమ్మడి రాష్ట్రంలో నియమించిందని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అయిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం నియమించలేదన్నారు. ఇప్పుడైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ చైర్మన్ నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ హాస్పిటల్లో, పోలీస్ శాఖలో, ప్రభుత్వ హాస్టళ్లలో బార్బర్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం

గోల్కొండ: తెలంగాణలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. గురువారం ఆయనను లక్ష్మీనగర్ చౌరస్తా వద్ద గల బీఆర్ఎస్ నాయకుడు కె.శేఖర్‌రెడ్డి బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మాజీ సీఎం కేసీఆర్‌కు పేద ప్రజలే ఊపిరి అని అన్నారు. తన పదేళ్ల పాలన కాలంలో కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు పరిచి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. మరోవైపు మాజీ మంత్రి కేటీఆర్ యువతకు వెలుగు రేఖగా ఉంటూ రాష్ట్రంలో ఉపాధి కల్పనకు ఎంతో కృషి చేశారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీఆర్ఎస్ ఒక్కటే అన్నారు. బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గుప్తా, సాగర్ తదితరులున్నారు.

ట్రాన్స్‌పోర్ట్ వాహనాలపై ఆర్టీఏ ఫోకస్

- టాక్స్‌కట్టని వాహనాల సీజ్
- ఫిట్‌నెస్ లేని వాహనాల గుర్తింపు
- ముందుగా చెత్త వాహనాలపై చర్యలు
- నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్
- హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్ పెట్టించాలి
- జిల్లా ఉప రవాణాశాఖ అధికారి సదానందం



మణికొండ: టాక్స్‌లు కట్టకుండా, ఫిట్‌నెస్‌లు లేకుండా తిరుగుతున్న వాహనాల భరతం పట్టేందుకు రవాణాశాఖ అధికారులు సిద్ధం అయ్యారు. శుక్రవారం నుంచి జిల్లా వ్యాప్తంగా చెత్త సేకరణ ఆటోలతో పాటు రవాణా వాహనాలను సీజ్ చేసే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్‌లు ప్రతి వాహనానికీ తప్పనిసరిగా అమలు చేయనున్నారు. గురువారం మణికొండలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో జిల్లా ఉప రవాణాశాఖ అధికారి సదానందం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన దీర్ఘకాలంగా టాక్స్‌లు కట్టకుండా, ఫిట్‌నెస్‌లు లేకుండా అనేక వాహనాలు రోడ్లపై తిరుగుతున్నట్టు గుర్తించామన్నారు. వాటిల్లో చెత్త సేకరణ వాహనాలు అధికంగా ఉన్నాయని తెలిపారు. వాటన్నింటికీ బ్రేక్‌లు వేసేలా శుక్రవారం నుంచి ప్రత్యేక తనిఖీలను నిర్వహిస్తున్నామన్నారు. వాటిల్లో దొరికిన వాహనాలకు 200 శాతం జరిమానాలు విధించి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వాహన యజమానులు గ్రీన్ ట్యాక్స్ చెల్లించి రీ రిజిస్ట్రేషన్ చేసుకుని మరో ఐదు సంవత్సరాలు పొడగించుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండని పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని, వారికి లైసెన్స్‌లు ఇప్పించవద్దన్నారు. నిబంధనలు పాటించకపోతే పిల్లలతో పాటు వారి తల్లితండ్రులు నేరస్థులు అవుతారన్నారు. వెంటనే ట్యాక్స్‌లు చెల్లించి తమ వాహనాలను నడుపుకోవాలని ఆయన సూచించారు.

అరకొరగానే సన్న బియ్యం పంపిణీ

- రేషన్ షాపుల్లో నో స్టాక్ బోర్డులు
- పలు షాపుల మూసివేత



సన్న బియ్యం స్టాక్‌లేక మూతపడిన రేషన్ షాప్

బండ్లగూడ: సన్న బియ్యం పంపిణీని ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. కానీ అమలు మాత్రం నత్తనడకన సాగుతోంది. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్న 10 రేషన్‌షాపుల్లో సన్న బియ్యం అయిపోయాయి. అలా వచ్చాయో లేదో ఇలా పంపిణీ చేసేశారు. కానీ లబ్ధిదారులు మాత్రం తమకు సన్నబియ్యం రాలేదని చెబుతున్నారు. ఆశగా రేషన్ దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. తీరా అక్కడికెళ్లాక బియ్యం అయిపోయాయి అని, నో స్టాక్ అని బోర్డులు కనిపిస్తున్నాయి. లబ్ధిదారులకు వస్తాయనే సమాధానం వినిపిస్తోంది. సన్న బియ్యం అందని లబ్ధిదారులు మాత్రం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

10 రేషన్‌షాపుల్లో 1,767 కింటాల బియ్యం..

కార్పొరేషన్ పరిధిలో 10 రేషన్‌షాపులు ఉండగా కార్డులు మాత్రం కేవలం 8,534 ఉన్నాయి. ఇప్పటి వరకు 1,767 కింటాల సన్న బియ్యం రావడంతో అవి పంపిణీ చేశారు. ఇంకా రావలసిన బియ్యం రాకపోవడంతో డీలర్లు రేషన్‌షాపులకు తాళాలు వేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు రేషన్‌షాపుల చుట్టు తిరుగుతూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పేదలకు వంద శాతం సన్న బియ్యం పంపిణీ జరిగే విధంగా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాల పరిసరాలు శుభ్రం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో హెడ్ మాస్టర్ నర్సింహులు ఆధ్వర్యంలో పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు పచ్చ శ్రీనివాస్ పర్యవేక్షణలో పాఠశాల సుందరకరణలో భాగంగా గురువారం పాఠశాల పరిసరాలను శుభ్రం చేసి చెత్త చెదారం, మట్టిదిబ్బలు, గుండురాళ్లను తొలగించారు. అనంతరం విద్యార్థులకు ప్లే గ్రౌండ్‌ను, మొక్కలను నాటారు. గ్రామ ప్రజలు, పిల్లల తల్లిదండ్రులు పాఠశాలను సందర్శించి నర్సింహులు చేసిన కృషిని ప్రశంసిస్తున్నారు.

గంజాయి విక్రేత అరెస్టు



నిందితుడు షేక్ జకీర్

అత్తాపూర్: నిషేధిత గంజాయిని విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అత్తాపూర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... పహాడీషరీఫ్ ప్రాంతానికి చెందిన షేక్ జకీర్(42) మహారాష్ట్రలోని అమరావతి నుంచి నిషేధిత గంజాయిని కొనుగోలు చేసి నగరంలో విక్రయిస్తున్నాడు. ఈ నెల 8న మధ్యాహ్నం హసన్‌నగర్‌లో గంజాయిని తీసుకొచ్చి అవసరం ఉన్న వారికి విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారంతో నిందితుడిని పట్టుకొని అతడి నుంచి 1012 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

కార్వాన్‌లో బీజేపీ బలోపేతానికి కృషి

గోల్కొండ: కార్వాన్ డివిజన్‌లో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తున్నామని ఆ పార్టీ కార్వాన్ డివిజన్ అధ్యక్షుడు ఉద్దడి జగదీష్‌కుమార్ అన్నారు. గురువారం కార్వాన్ సరస్వతీ శిశు మందిర్‌లో కార్వాన్ డివిజన్ బీజేపీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ... డివిజన్ పరిధిలో పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తామని, ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రధాని నరేంద్రమోదీ పాలన విజయాలు కూడా ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. పదేళ్ల పరిపాలన కాలంలో నరేంద్రమోదీ దేశాన్ని పటిష్ఠ పరిచి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం గురించి కూడా వివరించాలన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

అఫ్జల్‌గంజ్: చుడిబజార్‌లోని రామ్‌మనోహర్ లోహియా మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ సూపరింటెండెంట్ ఇంజినీర్ సహదేవ్ రత్నాకర్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..9 ఏళ్ల క్రింద అప్పటి హోంమంత్రి నాయినీ నర్సింహారెడ్డి చొరవతో రామ్‌మనోహర్ లోహియా ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులు ప్రారంభించామన్నారు. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో నేటి వరకు పనులు పూర్తి కాలేదన్నారు. ఇకనైనా వెంటనే పనులు పూర్తి చేయాలన్నారు.

ఓర్వలేకే బీఆర్ఎస్ నాయకుల విమర్శలు

బండ్లగూడ: అభివృద్ధిని చూసి ఓర్వలేక కొంత మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పాలకులపై విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు దప్పు నవీన్‌కుమార్ విమర్శించారు. గురువారం బండ్లగూడలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కొంత మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తూ బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం ఇస్తుంది కానీ కొత్త రేషన్ కార్డుల పరిస్థితి ఏమిటి అని ప్రశ్నిస్తున్నారన్నారు. ఒకసారి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించే ముందు మీ బీఆర్ఎస్ పాలనను గుర్తు చేసుకోవాలన్నారు. 10 సంవత్సరాలలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేకపోయిందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన కొన్ని నెలల్లోనే తెలంగాణ రాష్ట్రంలో కొన్ని వేల కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసిందన్నారు. ఈ నేపథ్యంలో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 1350 మంది లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు అందాయన్నారు. అలాగే మణికొండ మున్సిపాలిటీలో 514 మంది, నార్సింగి మున్సిపాలిటీలో 951 మంది మొత్తం గండిపేట మండంలో 2815 మంది లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయన్నారు. ఈ కొత్త రేషన్ కార్డుల ద్వారానే ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన సన్న బియ్యం తీసుకుంటున్నారన్నారు. ఇకనైనా బీఆర్ఎస్ నాయకులు కళ్లు తెరుచుకుంటే మంచిదని హితవు పలికారు.

సన్నబియ్యం పంపిణీ



హైదర్‌గూడలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

అత్తాపూర్: పేదలకు కడుపు నిండా అన్నం అందించాలనే లక్ష్యంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉచితంగా సన్నబియ్యంను అందిస్తున్నదని చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. అత్తాపూర్ డివిజన్ పరిధిలోని రేషన్ షాపుల వద్ద ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఐదు కిలోల సన్న బియ్యం ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. కేవలం కిలో మాత్రమే రాష్ట్ర ప్రభుత్తం తన వాటాగా ఇస్తోందన్నారు. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. లేకుంటే కాంగ్రెస్ వాళ్లే మొత్తం ఆరు కిలోల సన్నబియం ఇస్తున్నామని జనాన్ని నమ్మిస్తున్నారన్నారు. నేతలు కొమురయ్య, కె.సుధాకర్, ఎస్.విజయ్‌కుమార్, బీజేపీ అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు సులిగే వెంకటేష్, నేతలు కిరణ్‌చారి, నల్లింగ్ రమేష్, జయానంద్‌రెడ్డి, రాజు పైల్వాన్, రావుల జగన్, అనురాధ, రాము, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బస్తీ చలో అభియాన్



మణికొండలో బస్తీ దవాఖానాను సందర్శిస్తున్న బీజేపీ నాయకులు

మణికొండ: పట్టణాలు, బస్తీలలో ప్రభుత్వ రంగ సంస్థలు, సంస్థల తరఫున ప్రజలకు అందుతున్న సేవలు, సౌకర్యాలు, అసౌకర్యాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలనే ఉద్దేశంతో బీజేపీ నాయకులు గురువారం పర్యటించారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని బస్తీ దవాఖానాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ షాపులు, ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. మున్సిపాలిటీల బీజేపీ అధ్యక్షులు బి.రవికాంత్‌రెడ్డి, ఎం.నగేష్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.అంజన్‌కుమార్‌గౌడ్, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ, మణికొండ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మున్సిపాలిటీలలో ఇప్పటికే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు పీఎం శ్రీ పథకంలో బాగంగా అదనపు తరగతి గదులు, ల్యాబ్‌లు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఇచ్చిందన్నారు. ప్రజలకు అందుతున్న రేషన్ బియ్యంలోను ఎక్కువ మొత్తం కేంద్ర ప్రభుత్వ వాటానే ఉందన్నారు. అదే తరహాలో మరిన్ని రంగాలలో కేంద్ర ప్రభుత్వం సేవలు అందించేందుకు రాబోయే రోజుల్లో కృషి చేస్తుందన్నారు. మణికొండలో జరిగిన కార్యక్రమంలో నాయకులు సి.బీరప్ప, సి.హెచ్. ఇందిర, ఎం.రాఘవరెడ్డి, అనితాదేవి, వందన నగేష్, జె.లక్ష్మి, సత్యనారాయణ, శంకర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రవాణా భద్రతను మరింత మెరుగుపరచాలి



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు

గోల్కొండ: మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, రూపొందించిన చట్టాలను తెలుసుకోవాలని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ శ్రీవిద్యా అన్నారు. గురువారం షేక్‌పేట్‌లోని కళాశాలలో తెలంగాణ మహిళల భద్రత విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఉమెన్ సేఫ్టీ క్లబ్ వారు 'టువర్డ్స్ సేఫ్ మోబిలిటి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు రవాణా భద్రతను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. ఉబర్ రైడ్స్ వారు టీ–సేఫ్ కార్యక్రమంతో కలిసి తాము కూడా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరైన ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ రమారాజేశ్వరి మాట్లాడుతూ.. జి.నారాయణమ్మ కళాశాల విద్యార్థినులు ఎంతో చురుకైన వారని పదేళ్లుగా తాను జీఎన్ఐటీఎస్ యాక్టివిటిస్‌ను పరిశీలిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో జీఎన్ఐటీఎస్ చైర్మన్ రాఘవరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, అభయ కన్వీనర్ అపర్ణ, డాక్టర్ ఎం.వి.ఎల్.సూర్యకుమారి పాల్గొన్నారు.

కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్వాన్, లంగర్‌హౌస్, గోల్కొండ తదితర ప్రాంతాలకు చెందిన వారు ఆయన వద్దకు వచ్చి తమ తమ సమస్యలను విన్నవించారు. నల్లాల్లో వస్తున్న నీరు సరిపోవడం లేదని ఎన్నోసార్లు లో ప్రెషర్‌తో వస్తుందని పలువురు ఆయనకు ఫిర్యాదు చేశారు. తమ బస్తీలోని వీధుల్లో డ్రైనేజీ పొంగిపొర్లుతుందని మరికొందరు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వాహనాల రాకపోకలతో డ్రైనేజీ పైప్‌లైన్‌లు దెబ్బతింటున్నాయని పలుచోట్ల డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పగిలి మురుగు నీరు రోడ్లపైకి వస్తుందన్నారు. అయితే వీటిని వెంటనే అధికారుల దృష్టికి తెచ్చి కొత్త పైప్‌లైన్లు, మ్యాన్‌హోల్ మూతలు వేయిస్తున్నామన్నారు. ఎక్కడ కూడా డ్రైనేజీ నీరు రోడ్లపై ప్రవహించకూడదని తాను జలమండలి అధికారులను ఆదేశిస్తానన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన ఫిర్యాదులు ప్రతినిత్యం వస్తున్నాయని అయితే వీటిని వెంట వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. తాగునీటి సరఫరాకు ఎటువంటి కోతలు లేవని, కార్వాన్ నియోజకవర్గానికి సరిపడా నీరు సరఫరా అవుతుందన్నారు. సాంకేతిక కారణాల వల్ల పలుచోట్లలో ప్రెజర్‌తో నల్లాల్లో నీరు వస్తుందన్నారు. అటువంటి ప్రాంతాలను గుర్తించి వాటిని అధికారులకు తెలుపుతానన్నారు. అటువంటి ప్రాంతాల్లో బూస్టర్లు పెట్టి నీటి ప్రెజర్ పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. వీధిలైట్ల నిర్వహణపై కూడా గత వారం తాను అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చానన్నారు.

ముఖ్యంగా బస్తీల అంతర్గత రోడ్లల్లో ఉన్న వీధి దీపాలను అధికారులు పట్టించుకోవడం లేదన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. పలుచోట్ల హైమాస్ట్ లైట్లు అలంకారప్రాయంగా మారిన దృశ్యాలను తాను స్వయంగా చూశానన్నారు. బల్దియా వీధిదీపాల విభాగం అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. అయితే త్వరలోనే తాను విద్యుత్ దీపాల మరమ్మతు పనులు చేయిస్తానన్నారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి



ఏఈకి వినతిపత్రం ఇచ్చిన శివాజీనగర్‌వాసులు

మణికొండ: కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉన్నందున తక్షణమే స్పందించి వాటిని పరిష్కరించాలని శివాజీనగర్ కాలనీవాసులు మణికొండ విద్యుత్ ఏఈ సంతోష్‌కుమార్‌ను కోరారు. గురువారం మణికొండ మాజీ సర్పంచ్ యాలాల నరేష్ ఆధ్వర్యంలో వారు పుప్పాలగూడ సబ్ స్టేషన్‌లో ఏఈని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని శివాజీనగర్ కాలనీలో విద్యుత్ వైర్లు వదులుగా ఉండటంతో గృహాలకు తగులుతున్నాయన్నారు. పలుమార్లు అవి తెగి రోడ్లపై పడ్డాయని, ఆ సమయంలో బయట ఎవరూ లేక పోవటంతో ప్రాణాపాయం తప్పిందన్నారు. కాలనీలో విద్యుత్ వాడకం పెరగటంతో ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం ఏమాత్రం సరిపోవటం లేదని, దాన్ని 100కేవీ నుంచి 160కేవీకి మార్చాలని కోరారు. త్వరలోనే కాలనీలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏఈ హామీ ఇచ్చారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె. రమేష్, చైర్మన్ కె.దేవేందర్, వైస్ చైర్మన్ వై.కుమార్, నాయకులు కె.శ్రీనివాస్, జె.జంగయ్య, జైరాం, బి.రాజు, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో పరిపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న పద్మజ

మైలార్‌దేవ్‌పల్లి: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మజ అన్నారు. గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శేరిలింగంపల్లి ప్రాజెక్టు మైలార్‌దేవ్‌పల్లి సెక్టార్ మార్కండేయనగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షంలో భాగంగా సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, చిరుధాన్యాల ప్రాముఖ్యత, రక్తహీనత నివారణ అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. చిరుధాన్యాలలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని మహిళలు తప్పకుండా తీసుకోవాలన్నారు. చిరుధాన్యాలలో పోషకాలు పుష్కలంగా ఉంటాయని, గర్భిణులు, బాలింతలు, రక్తహీనతతో బాధపడుతున్న వారు వీటిని తీసుకోవడం చాలా మంచిదన్నారు. మార్కండేయనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ చైర్మన్ వీడం రమేష్, అంగన్‌వాడీ టీచర్లు రత్న, మాధవి, అనిత, లక్ష్మీ, సుజాత, స్వప్న, ఏఎన్ఎం ప్రేమదేవి, ఆశావర్కర్ సరిత, ఆర్పీ నాగమణి, హెల్పర్ శోభ తదితరులు పాల్గొన్నారు.

క్యూఎన్ఎక్స్‌తో ఎంజీఐటీ ఒప్పందం



ఒప్పందం చేసుకున్న ఇరు సంస్థల ప్రతినిధులు

మణికొండ: విద్యార్థులకు, అధ్యాపకులకు శిక్షణ ఇచ్చి వారిని ఎంబెడెడ్ సాఫ్ట్‌వేర్ డెవలపర్లుగా తీర్చిదిద్దేందుకు క్యూఎన్ఎక్స్ ఎవ్రివేర్ ప్రోగ్రాం సంస్థతో గండిపేటలో మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాల గురువారం ఒప్పందం కుదుర్చుకుంది. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, క్యూఎన్ఎక్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్ జైన్‌లు బుధవారం ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బ్లాక్బెర్రీ రియల్ టైమ్ ఆపరేటింగ్ సిస్టమ్ అయిన క్యూఎన్ఎక్స్ సంస్థ ఆటోమోటివ్, వైద్య పరికరాలు, రోబొటిక్స్ పరిశ్రమ ఆటోమేషన్, వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ వంటి పరిశ్రమలకు కీలకమైన అప్లికేషన్లను ఇస్తుందన్నారు. మైక్రో కెర్నల్ ఆర్కిటెక్చర్ అసమానమైన విశ్వసనీయత, భద్రత, పనితీరు నిర్ధారిస్తుందన్నారు. విద్యార్థులకు కొత్త అప్లికేషన్ రంగాలను అన్వేషించటం, సృష్టించటానికి వీలు కలిపిస్తుందన్నారు. కళాశాల ఈసీఈ హెచ్ఓడీ డాక్టర్ ఎస్‌పీ సింగ్, శిక్షణ, ప్లేస్‌మెంట్ హెడ్ శాంత కె. నూతలపాటి, ఏటీపీఓ డాక్టర్ పీవీఎస్ లక్ష్మీనారాయణ, పీ స్క్వేర్ టెక్నాలజీస్ సీఈఓ శ్రీనివాస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షుడు రేపల్లి కృష్ణ

బండ్లగూడ: బిల్డర్, సెంట్రింగ్, తాపీ మేస్త్రీలతో కాంక్రీట్ మిల్లర్‌ల సభ్యుల ఆత్మీయ సమ్మేళనం గురువారం ఆరెమైసమ్మ యూనిక్ గార్డెన్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా కాంక్రీట్ మిల్లర్ యూనియన్ అధ్యక్షుడు రేపల్లి కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏప్రిల్ 5 నుంచి 12వ తేదీ వరకు కాంక్రీట్ కార్మికుల అసోసియేషన్ తరపున బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. సమ్మె కారణంగా బిల్డర్, మేస్త్రీలు, ఓనర్స్ తమతో చర్చలు జరిపి వారు పడుతున్న ఇబ్బందులను, తమ డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మెను విరమించామని వారు వెల్లడించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న తమకు ఉన్న ఆర్‌టీఏ, ట్రాఫిక్ సమస్యలు, కార్మికుల పిల్లలకు ఉచిత విద్య తదితర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. చైర్మన్ నాగరాజు, కన్వీనర్ రవికుమార్‌రెడ్డి, బి.గోపాల్, కో కన్వీనర్ శ్రీనుయాదవ్, నాగేశ్వర్‌రెడ్డి, టీరయ్య, భగవత్‌కుమార్, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర మద్యాన్ని సరఫరా చేసే బెడ్ రోలర్ అరెస్ట్

నాంపల్లి: అంతరాష్ట్ర మద్యాన్ని నగరానికి దిగుమతి చేసే వ్యక్తిని అరెస్టు చేసిన ఘటన హైదరాబాద్ రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు సంయుక్తంగా గురువారం హైదరాబాద్ రైల్వేస్టేషన్‌లో సోదాలు జరిపారు. ప్లాట్‌ఫారం నెం-6 మీద బ్యాగ్‌తో రైళ్లలో పనిచేసే ఒక బెడ్ రోలర్ వేచి ఉండటాన్ని గమనించారు. అడ్డగించి బ్యాగు తెరి చూడగా అందులో వివిధ బ్రాండ్లకు చెందిన మద్యం బాటిల్స్ కనిపించాయి. ఈ మద్యాన్ని హరియాణా నుంచి హిసార్ ఎక్స్‌ప్రెస్ రైలులో హైదరాబాద్‌కు తీసుకువచ్చినట్లుగా బెడ్ రోలర్ ఒప్పుకున్నారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన అమానిగంజ్ చోయ్, ఫైజాబాద్‌కు చెందిన రామ్ సరన్ కుమారుడు శివ 'జైపూర్–హైదరాబాద్ నగరాల మధ్య నడిచే వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలులో బెడ్ షీట్లను మార్చే బెడ్ రోలర్‌గా పనిచేస్తున్నారు. అతను ఓ కాంట్రాక్టర్ కింద రైళ్లలో బెడ్ షీట్స్‌ను శుభ్రం చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. హరియాణాలో తక్కువ ధరకు లభించే బ్లెండర్స్ ప్రైడ్-18 బాటిల్స్, 8 పీఎం-10 విస్కీ బాటిల్స్‌ను హైదరాబాద్‌కు రైలులో తీసుకువచ్చాడు. వీటి విలువ సుమారు రూ.32,160 గా ఉంటుందని హైదరాబాద్ జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అంతర్రాష్ట్రానికి చెందిన మద్యాన్ని సరఫరా చేసేందుకు అతడి వద్ద ఎలాంటి అనుమతులు లేకపోవడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.